సాక్షి
పల్నాడు
శనివారం । 28 । అక్టోబర్ । 2023



బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే పల్నాడు బాలోత్సవం పోస్టర్‌ను కలెక్టర్ శివశంకర్ శుక్రవారం ఆవిష్కరించారు.



వైద్య విద్యార్థులకు అభినందన

గుంటూరు మెడికల్: ఇంటర్ కాలేజ్ గేమ్స్‌లో సత్తాచాటిన గుంటూరు వైద్య కళాశాల విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అభినందించారు.



కొనసాగుతున్న భవానీల రద్దీ

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది. దూర ప్రాంతాల నుంచి వస్తున్న భవానీలు పుణ్యస్నానాలు ఆచరించి, భక్తితో దీక్షల విరమణ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు అమరేశ్వరాలయం మూసివేత

అమరావతి: చంద్రగ్రహణం నేపథ్యంలో ఈనెల 28న శనివారం రాత్రి 7 గంటలకు అమరేశ్వరాలయాన్ని మూసివేస్తామని ఈఓ వేమూరి గోపినాథశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని శనివారం 6.30 గంటలకు స్వామి ఏకాంతసేవలు ముగిసిన అనంతరం 7 గంటలకు మూసివేస్తామని పేర్కొన్నారు. పాక్షిక చంద్ర గ్రహణానికి పట్టు, విడుపు కాలాలను కలుపుకుని ఈనెల 29న ఉదయం దేవాలయం తెరిచి స్వామి వారికి తిరువంజన సేవ, సంప్రోక్షణ ప్రత్యేక పూజల అనంతరం 9.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామని వివరించారు.

నేడు సీనియర్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో సీనియర్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ ఆధారంగా జిల్లా జట్టును ఎంపిక చేసి వచ్చేనెల 2, 3 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న అంతర్ రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 96429 31771ను సంప్రదించాలన్నారు.

ముగ్గురికి ఏవోలుగా పదోన్నతి

గుంటూరు మెడికల్ : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయ పరిధిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ముగ్గురికి శుక్రవారం పరిపాలన అధికారులుగా పదోన్నతి లభించింది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న మాణిక్యారావుకు అక్కడే ఏఓగా ప్రమోషన్ ఇచ్చారు. సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న మెహరున్నీసాకు ఏవోగా ప్రమోషన్ ఇచ్చి చిలకలూరిపేట బదిలీ చేశారు. చిలకలూరిపేటలో పనిచేస్తున్న విజయలక్ష్మికి ఏఓగా ప్రమోషన్ ఇచ్చి చీరాల బదిలీ చేశారు.

153 బస్సులపై కేసులు నమోదు

గుంటూరు ఈస్ట్ : దసరా పండగ సందర్భంగా కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 153 బస్సులపై కేసు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మోటారు వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారన్నారు. ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టగా, కాజ టోల్‌ప్లాజా, పేరేచర్ల జంక్షన్‌ల వద్ద 153 బస్సులు నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నట్లు గుర్తించి ఆ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు.

ఏకోనాంపేటలో కార్డన్ సెర్చ్




విజయపురిసౌత్: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాచర్ల మండలంలోని ఆంధ్రప్రదేశ్ బోర్డర్ గ్రామమైన ఏకోనాంపేటలో శుక్రవారం రాత్రి మాచర్ల రూరల్ సీఐ ఎస్‌కె సమీముల్లా ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు అక్రమ మద్యం, నగదు ఇతర వస్తువులు రాకుండా కార్డన్‌సెర్చ్ చేపట్టారు. నాగార్జున సాగర్ బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల రూరల్ ఎస్‌ఐ కె రాజశేఖర్, సాగర్ ఏఎస్‌ఐ ఎస్‌కె మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,227 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 212, బ్యాంక్ కెనాల్‌కు 1,102, తూర్పు కెనాల్‌కు 630, పశ్చిమ కెనాల్‌కు 165, నిజాంపట్నం కాలువకు 338, కొమ్మమూరు కాల్వకు 1,217 క్యూసెక్కులు వదిలారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 525.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,765, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 845.30 అడుగుల వద్ద ఉంది.

బైక్ రేసింగ్‌లు జరిగితే వేటే



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ పాలరాజు చిత్రంలో ఏఎస్పీలు



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

- రాత్రి 11 గంటలకు బార్లు మూయించాలి
- అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలి
- ఎన్నికలు సమీపిస్తున్నందున రౌడీషీటర్ల బైండోవర్‌పై దృష్టి పెట్టండి
- మాట వినకుంటే అధికారులపై వేటు తప్పదు
- సమీక్షలో ఐజీ పాలరాజు హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలో బైక్ రేసింగ్‌లు జరిగితే ఆయా స్టేషన్ అధికారులపై వేటు వేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలు, అదనపు ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లాలో జరుగుతున్న బైక్ రేసింగ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్ రేసింగ్‌లు జరిగే ప్రాంతాలపై పూర్తి నిఘా పెట్టాలని ఆదేశించారు. గురువారం పట్టాభిపురంలో బార్ వద్ద జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందడంపైనా ఐజీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాత్రి 11 గంటలకల్లా బార్లు మూయించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై కేసులు పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. బీట్లు సక్రమంగా వేయడంతోపాటు విజిబుల్ పోలీసింగ్ జరిగేలా చూడాలన్నారు. బీట్ కానిస్టేబుళ్ల వద్ద విజిల్స్, లాఠీ, టార్చిలైట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఆర్మ్‌డ్ పోలీసులూ గస్తీ తిరగాలి

బీట్ కానిస్టేబుళ్లతోపాటు అర్మ్‌డ్ పోలీసులు గస్తీ తిరగాలని, రాత్రి 12 గంటల తర్వాత రోడ్లపైకి వచ్చేవారిని ప్రశ్నించడంతోపాటు వారి ఫోన్ నంబర్, బైక్‌నెంబర్లను నమోదు చేసి కంట్రోల్ రూమ్‌కు పంపాలన్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. గుంటూరు నగరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచాలని, ఆదివారంతోపాటు మిగిలిన రోజుల్లోనూ వారిని స్టేషన్‌కు పిలవడంతోపాటు వారి కదలికపై నిఘా ఉంచాలన్నారు. శిక్ష పడిన కేసుల్లో ముద్దాయిలపై షీట్లు ఓపెన్ చేయాలని, ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలి

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని ఐజీ పాలరాజు సూచించారు. స్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లను తీర్చిదిద్దాలని సూచించారు. కేసు నమోదు చేయడమే కాకుండా పరిష్కరించడంపైనా దృష్టి పెట్టాలని, ఈ విషయంలో గుంటూరు పోలీసులు రేంజ్‌లోనే వెనుకబడి ఉన్నారని ఐజీ అసహనం వ్యక్తం చేశారు. కేసులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.

కుడి జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన ఏపీజెన్‌కో సీఈ

విజయపురిసౌత్: ఏపీ జెన్‌కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు శుక్రవారం నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా జలవిద్యుత్ కేంద్రంలో జరుగుతున్న పెన్ స్టాక్ సర్వీస్ మొదటి యూనిట్ గేట్ మరమ్మతు పనులను పరిశీలించారు. పెన్ స్టాక్ గేట్ పనులను నవంబర్ 10లోపు పూర్తి చేయాలని ఈఈ వైఎస్ ఆర్‌కే ప్రసాద్‌తో చెప్పారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఈఈ 327 యూనియన్ ఆధ్వర్యంలో సీఈ కాంతారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ రాజారెడ్డి, యూనియన్ అధ్యక్షుడు ఎం.సాంబశివరావు, కార్యదర్శి బి.సూరజ్‌చంద్ పాల్గొన్నారు.



ఏపీజెన్‌కో సీఈ కాంతారావును సన్మానిస్తున్న సాగర్ కుడిజలవిద్యుత్ కేంద్రం ఈఈ ప్రసాద్, ఉద్యోగులు

చీరస్మరణీయం

- మంగళగిరి చేనేత చీరకు జాతీయస్థాయి గుర్తింపు
- ఒక జిల్లా- ఒక ఉత్పత్తి అవార్డుకు కేంద్ర బృందం పరిశీలన
- తుది దశలో ఎంపిక ప్రక్రియ



చేనేత భవన నిర్మాణ పనులపై సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు(ఫైల్)

మంగళగిరి: మంగళగిరి చేనేత చీరలకు చారిత్రాత్మక గుర్తింపు లభించనుంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో చేపట్టిన ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) జాతీయ అవార్డుల ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఓడీఓపీలో భాగంగా జాతీయ అవార్డు-2023కు అన్ని రాష్ట్రాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా రాష్ట్రం నుంచి 13 ఉత్పత్తులకు చోటు లభించగా గుంటూరు జిల్లా నుంచి మంగళగిరి చేనేత చీరకు అవకాశం దక్కింది. ఇన్వెస్ట్ ఇండియా బృందం (జాతీయ స్థాయి టీమ్) సభ్యురాలు ఆరాధన శర్మ నేతృత్వంలో ఇటీవల పర్యటించి క్షేత్రస్థాయిలో చేనేత చీర తయారీని పరిశీలించారు. వివరాలను సేకరించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సారథ్యంలో మంగళగిరిలో కొత్తగా 3.60 కోట్లతో రాజీవ్ గృహ కల్ప వద్ద నిర్మించిన మగ్గం షెడ్లను, రూ.4 కోట్లతో పాతబస్టాండ్ ఆవరణలో నిర్మించిన ప్రగడ కోటయ్య-వైఎస్సార్ చేనేత భవనాలతోపాటు పట్టణంలోని చేనేత వస్త్ర దుకాణాలలో కేంద్ర బృందం పర్యటించింది. చేనేత చీరలు అవార్డుకు ఎంపికై తే మంచి మార్కెటింగ్ లభించడంతోపాటు పరిశ్రమకు పెట్టుబడులు పెరిగే అవకాశముంది.



మంగళగిరి చేనేత చీరలు

ఆనందంగా ఉంది



మంగళగిరి చేనేత చీరలు జాతీయ అవార్డు పరిశీలనకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. మగ్గం షెడ్లు, మార్కెటింగ్‌కు చేనేత భవనం నిర్మిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత పరిశ్రమతోపాటు కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం దిగ్విజయంగా అమలు చేస్తున్నారు. రానున్న రోజులలో అంతర్జాతీయ స్థాయిలో చేనేత పరిశ్రమకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తాం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే),
ఎమ్మెల్యే, మంగళగిరి

మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయి



మంగళగిరి చేనేత చీరలను జాతీయ అవార్డు ఎంపికకు పరిశీలించడం చాలా సంతోషంగా ఉంది. జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తే చీరలకు మరింత డిమాండ్ దక్కుతుంది. మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయి. కార్మికుల ఆదాయం పెరుగుతుంది. మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్కే ఎంతో కృషి చేస్తున్నారు.

– అవ్వారు సుబ్బారావు,
చేనేత వస్త్ర ఉత్పత్తిదారుడు

ఓటరమ్మా.. వందనం

అతివలదే ఆధిక్యం

- ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- డిసెంబరు తొమ్మిదిలోగా అభ్యంతరాల స్వీకరణ
- ప్రతి నియోజకవర్గంలోనూ మహిళలే అధికం
- గురజాలలో అత్యధిక ఓటర్లు

నరసరావుపేట: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఆధిక్యత చాటుకున్నారు. ఓటరు ముసాయిదా జాబితాను శుక్రవారం ఉప జిల్లా ఎన్నికల అధికారి, డీఆర్వో కె.వినాయకం విడుదల చేశారు. మొత్తం ఓటర్లు 17,01,399 మంది ఉండగా.. పురుషులు 8,33,923 మంది, స్త్రీలు 8,67,262 మంది, ట్రాన్స్‌జెండర్లు 214 మంది ఉన్నారు. పురుషుల కంటే స్త్రీలు 33,454 మంది అధికంగా ఉన్నారు. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారు. చిలకలూరిపేటలో పురుషుల కంటే స్త్రీ ఓటర్లు 9,084 మంది ఉన్నారు. గురజాలలో పురుషుల కంటే స్త్రీలు 6,403 మంది, నరసరావుపేటలో 4,757 మంది, సత్తెనపల్లిలో 4,473, పెదకూరపాడులో 4,423, మాచర్లలో 3,506 ఉండగా, వినుకొండలో కేవలం 693 మందే అధికంగా ఉండటం గమనార్హం. జిల్లా మొత్తంపై 214మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీంతోపాటు సర్వీసు ఓటర్లు 1,307 మంది ఉన్నారు. డీఆర్వో మాట్లాడుతూ ఓటరు జాబితా తనిఖీ నిమిత్తం ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు అధికారి, పోలింగ్ బూత్‌ల వద్ద పనివేళల్లో అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఓటర్లు అందరూ జాబితాను తనిఖీచేసుకొని ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబరు తొమ్మిదో తేదీలోపు ఓటరు ఫారంల ద్వారా తమ వివరాలు సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పల్నాడు జిల్లాలో ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
పెదకూరపాడు	1,10,062	1,14,485	23	2,24,570
చిలకలూరిపేట	1,07,925	1,17,009	49	2,24,983
నరసరావుపేట	1,11,931	1,16,688	38	2,28,657
సత్తెనపల్లి	1,14,976	1,19,449	17	2,34,442
వినుకొండ	1,28,638	1,29,331	21	2,57,990
గురజాల	1,30,782	1,37,185	43	2,68,010
మాచర్ల	1,29,609	1,33,115	23	2,62,747



సామర్థ్యాల 'బేసీస్'

- 3, 6, 9 తరగతులకు సీస్ పరీక్ష
- నవంబర్ 3న ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహణ
- ముందుగా ప్రాక్టీస్ పరీక్షలకు సన్నద్ధం



సత్తెనపల్లి: చదువే అన్నింటికీ మూలమని ప్రభుత్వం గుర్తించింది. అందుకు తగినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ సౌకర్యాలను సమకూరుస్తూ విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది. విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సర్వే 2021లో చేశారు. తిరిగి 2024లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) మండల స్థాయిలో చేపట్టనున్నారు. ఈ సీస్ సర్వే నవంబర్ 3న దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. అదే సమయంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్నీ అంచనా వేయనున్నారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపిక

స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్)లో భాగంగా క్షేత్రస్థాయిలో పరీక్ష నిర్వహణకు ఆయా మండలాలకు ఎంత మంది ఎఫ్‌ఏలు అవసరమనేది జిల్లా విద్యాశాఖ నిర్ధారణకు వచ్చింది. ఎఫ్‌ఏలుగా ఛాత్రోపాధ్యాయులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులను నియమించి శిక్షణ ఇచ్చారు. సర్వే పరీక్ష వీరి పర్యవేక్షణలోనే జరుగుతుంది. జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జరగనున్న పరీక్షలను డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపాల్, లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా మండల విద్యాశాఖ అధికారులు 1, 2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వ్యవహరిస్తారు. ఈ పరీక్షకు ముందుగా విద్యార్థులను ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంది. గతంలో నిర్వహించిన సర్వేలో భాగంగా 3,5,8 తరగతులకు పరీక్ష నిర్వహించగా ఈ ఏడాది సీస్ సర్వేలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. ఎస్సీఈఆర్టీ నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లోనే ఈ పరీక్ష నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు ఎస్సీఈఆర్టీ ముందుగా సరఫరా చేసిన ప్రాక్టీస్ పేపర్లతో శిక్షణ ఇస్తారు. తద్వారా సీస్ పరీక్షను విద్యార్థులు సమర్థవంతంగా రాసే అవకాశం ఉంటుంది. పూర్తిగా ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు. 3,6 తరగతుల వారు 40 ప్రశ్నలు 60 నిమిషాల్లో, 9వ తరగతి విద్యార్థులు 60 ప్రశ్నలు 90 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

సర్వే నిర్వహించే పాఠశాలలు	1,171
పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు	31,967
ఎంపిక చేసిన ఇన్విజిలేటర్లు	1,585
ఎంపిక చేసిన మండలస్థాయి అధికారులు	28

సమర్థంగా నిర్వహిస్తాం



సీస్ సర్వేలో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షను మండలంలో సమర్థంగా నిర్వహిస్తాం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం ఇప్పటికే పూర్తయింది. 3, 6, 9 తరగతులకు సంబంధించి విద్యార్థులు పరీక్షలు రాయమన్నారు

– ఎ.శ్రీనివాసరావు,
ఎంఈఓ, సత్తెనపల్లి

లడ్డూ విక్రయాల్లో రికార్డు

విజయవాడ : దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల, ఆ తర్వాత మూడు రోజులలో మొత్తం 25 లక్షలకు పైగా లడ్డూల విక్రయాలు జరిగాయి. గడిచిన మూడేళ్లలో ఇదే రికార్డు అని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది ఉత్సవాలు, ఆ తర్వాత భవానీల రద్దీ మొత్తం కలిపి 24.48 లక్షల లడ్డూలను విక్రయిస్తే, 2021 దసరా ఉత్సవాల్లో 15.79 లక్షల లడ్డూల విక్రయాలు మాత్రమే జరిగాయి. దసరా ఉత్సవాల ప్రారంభం నుంచే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావులు లడ్డూ తయారీపై నిరంతరం పర్యవేక్షిస్తూ, లడ్డూ ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. ఇక భక్తులు కోరినన్ని లడ్డూలను ఇవ్వాలనే సంకల్పంతో అధికారులందరూ కలిసి పనిచేయడంతో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా లడ్డూలను తయారు చేసి భక్తులకు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా లడ్డూ కౌంటర్లు 24 గంటలు పని చేసి భక్తులకు, భవానీలకు లడ్డూలను అందజేశారు.



లడ్డూలను ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

పక్షం రోజులు.. 24 గంటలు తయారీ

దసరా ఉత్సవాలలో భక్తుల డిమాండ్‌కు తగినట్లుగా లడ్డూలను తయారు చేసి అందించడంలో ఎంతో మంది కార్మికుల శ్రమ దాగి ఉంది. ఉత్సవాలకు రెండు రోజుల ముందు నుంచే లడ్డూలను తయారు చేసి నిల్వ చేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగాయి. 12వ తేదీ నుంచి 26వ తేదీ వరకు లడ్డూ తయారీ కొనసాగింది. సుమారు 300 మంది కాంట్రాక్టు కార్మికులు నిరంతరం 24 గంటలు లడ్డూ తయారీ చేపట్టారు.

యార్డులో 17,807 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 17,006 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 17,807 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,200 నుంచి 25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,891 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

రాజకీయ పక్షాలకు కలెక్టర్ శివశంకర్ విజ్ఞప్తి

నరసరావుపేట: ప్రత్యేక సారాంశ సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో తప్పులు లేని జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాఫ్ట్ జాబితా శుక్రవారం విడుదల చేశామని పేర్కొన్నారు. ఓటరు నమోదుకు ఫారం-6, ఓటరు తొలగింపునకు ఫారం-7, అలాగే సవరణలకు ఫారం-8లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేసిన సవరణలతో జాబితా డిసెంబరు 26 నాటికి పూర్తి కావాలని పేర్కొన్నారు. జనవరి ఐదో తేదీన తుది జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. ఓటరు నమోదు ప్రక్రియను బూత్ లెవల్ అధికారుల ద్వారా చేయాలన్నారు. డూప్లికేషన్ లేకుండా చూడాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, గుర్తింపు పొందిన ఎనిమిది రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2500, గరిష్ఠ ధర రూ.4200, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.



క్లుప్తంగా

రక్తహీనత శాతం తగ్గించటమే ధ్యేయం కావాలి

- కలెక్టర్ ఎల్.శివశంకర్
- బంగారుతల్లి, మధ్యాహ్న భోజన పథకాలపై వీడియో కాన్ఫరెన్స్



సమీక్షలో జిల్లా కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేట: ప్రాథమిక స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు అన్ని చోట్ల మహిళలను చైతన్యపర్చి వారికి పౌష్టికాహారం అందిస్తూ తల్లిదండ్రులను ప్రోత్సహించి పిల్లలకు పౌష్టికాహారం అందించడం వంటి ప్రక్రియను చేపట్టడం ద్వారా జిల్లాలో రక్తహీనత శాతం తగ్గించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. గ్రామోదయం, నగరోదయంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బంగారు తల్లి పథకం సమగ్ర అమలు, మధ్యాహ్న భోజన పథకంపై సమీక్ష చేశారు. పదేళ్ల నుంచి 19 ఏళ్ల బాలికలు, యువత వరకు వరకు ఎనీమియా బారి నుంచి రక్షణ పొందేందుకు, వారిలో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించే కార్యక్రమం బంగారు తల్లి అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు బాలికల్లోనూ, యువతలోనూ రక్తహీనత శాతం పల్నాడు జిల్లాలో అధికంగా ఉందన్నారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. స్కూల్, కళాశాల స్థాయిలో టీచర్లు, అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అందరూ కలిసి బంగారు తల్లి రికార్డు పత్రాలను పరిశీలించి చూస్తే అర్థమయ్యేలా దీనిని తయారు చేయడం జరిగిందన్నారు. సమీక్ష సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలి

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ఈపూరు: ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ఈపూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై సుమారు 10 అర్జీలు అందించారు. రైతులు విద్యుత్, రోడ్డు, భూ ఆక్రమణ, పట్టాదారులు, విద్యుత్, లోటఓల్టేజీ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తీర్చడంలో అధికారులు ప్రధానపాత్ర పోషించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో రేకుల షెడ్ మరమ్మతులకు అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు నూతన ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. పాఠశాలలో ఆట స్థలం ఏర్పాటు చేసేందుకు అంచనాలు వేసి పంపాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులలో హిమోగ్లోబిన్ శాతం ఎంత మేరకు ఉన్నదో అడిగి తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. తక్కువ ఉన్న వారికి పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం తిని హిమోగ్లోబిన్ శాతం పెంచుకోవాలని, లేకపోతే రాబోయే కాలంలో ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదన్నారు. రికార్డులను సక్రమంగా తయారు చేయనందుకు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్లో విద్యార్థుల హిమోగ్లిబిన్ శాతం సరిగా నమోదు చేయలేదని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషిరెడ్డి, ప్రత్యేక అధికారి వరలక్ష్మి, ఎంపీడీఓ రంగనాయకులు, తహసీల్దార్ సుధాకర్, పంచాయతీరాజ్ డీఈ కొండయ్య, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల సహనాన్ని పరీక్షించవద్దు

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- కృష్ణారెడ్డి కుటుంబానికి పరామర్శ



మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గురజాల: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సహనాన్ని టీడీపీ నాయకులు పరీక్షించవద్దని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామంలో ఈనెల 23వ తేదీ రాత్రి వైఎస్సార్ సీపీ కార్యకర్త కూనిరెడ్డి కృష్ణారెడ్డిని టీడీపీ కార్యకర్తలు హత్యచేసిన విషయం విదితమే. కృష్ణారెడ్డి కుటుంబాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం పరామర్శించారు. ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీగా నేను కేవలం నియోజకవర్గ అభివృద్ధిపై, ప్రజలకు అందించే సంక్షేమ ఫథకాలపై దృష్టి సారించామే కానీ ఎప్పుడూ ఫ్యాక్షన్ రాజకీయాలు చేయలేదన్నారు. కృష్ణారెడ్డి హత్యకు గురికావడం బాధాకరమన్నారు. హత్యా కేసులో నిందితులకు కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు చేపడతామన్నారు. హత్య చేసిన వారు వారిని ప్రేరేపించిన వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో సహనంగా ఉన్నారని, వారు సహనం కోల్పోతే ఎవరూ ఆపలేరన్నారు. కృష్ణారెడ్డి కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. పోలీసులు విచారణ త్వరగా జరిపి కృష్ణారెడ్డి హత్యా కేసును చేధించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు, రైల్వే బోర్డు కమిటీ మెంబర్ కొమ్మినేని రవిశంకర్, వేలమూరి సైదారెడ్డి, కావూరి అంజిబాబు, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, గువ్వల చినవీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలి

ఏపీఓఎస్ఎస్ డెప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న దూరవిద్యా విధానం ద్వారా ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీ ఓఎస్ఎస్) డెప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన వెంకటేశ్వరరావు పాఠశాలలోని ఏపీఓఎస్ఎస్ అధ్యయన కేంద్రం ద్వారా దూరవిద్య టెన్త్, ఇంటర్ ప్రవేశాల ప్రగతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చేరేందుకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశముందని చెప్పారు. టెన్త్‌లో తప్పిన విద్యార్థులు దూరవిద్య టెన్త్‌లో చేరి పదో తరగతి పూర్తి చేసేందుకు అవకాశముందని, ప్రభుత్వమిచ్చే సర్టిఫికెట్ రెగ్యులర్ టెన్త్‌తో సమానమని అన్నారు. జిల్లాలోని అన్ని అధ్యయన కేంద్రాల కో–ఆర్డినేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయమై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం బి.వి జయలక్ష్మి, ఓపెన్ స్కూల్ ప్రతినిధి శ్రీధర్ ఉన్నారు.

ఆదాయంలో వినుకొండ డిపో ప్రథమస్థానం

వినుకొండ(నూజెండ్ల): జిల్లాలోనే ఆర్టీసీ వినుకొండ డిపో ఆదాయం ప్రథమస్థానం సాధించినట్లు డిపో మేనేజర్ ఎం.కోటేశ్వరరావునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలు అనంతరం వినుకొండ డిపోకు అదనంగా రూ.21.82లక్షల ఆదాయం వచ్చిందన్నారు. డిపోకు చెందిన 100 ఆర్టీసీ బస్సులు 40వేల కిలోమీటర్లు తిరిగాయని, ప్రయాణికులకు మెరుగైన సేవలు సకాలంలో పారదర్శకంగా అందించామన్నారు. జిల్లాలోనే అత్యధిక ఆదాయం వచ్చేలా కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందికి, అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. డిపో ఆదాయం పెంపునకు ఉద్యోగులు కృషి చేయాలని కోరారు.

జగనన్న భూ హక్కు రీ సర్వే వేగవంతం చేయండి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

పిడుగురాళ్ల: జగనన్న భూ హక్కు రీ సర్వేను వేగవంతంగా నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జేసీ సందర్శించారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న రైతులకు సంబంధించిన దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ మూడో విడత భూ రీ సర్వే నిర్వహించి త్వరగా పూర్తి చేయాలన్నారు. అసైన్డ్‌మెంట్ ల్యాండ్, ప్రభుత్వ భూమికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేయాలని, గ్రామ సర్వీస్, ఈనాం భూముల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సంబంధించిన మార్పులు, చేర్పులు వంటి కార్యక్రమాలు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే ఎఫ్‌లైన్ పిటిషన్‌లు, సబ్ డివిజన్ వంటివి త్వరగా పూర్తి చేయాలన్నారు. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్‌కు సంబంధించి లాండ్ కన్వర్షన్ సంబంధించిన ఫైల్‌లు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రికార్డుల పరిశీలన అనంతరం రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. సర్వే పెండింగ్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేఎఫ్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలను నివారించండి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరువెస్ట్: జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు సర్వీస్ రోడ్డులోనే ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై పోలీసు, రవాణా శాఖ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జాతీయ రహదారిపై చెత్తాచెదారం వేయడం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడడం చేయాలన్నారు. తెనాలి–నారాకోడూరు రహదారి మధ్యలోని బ్లాక్ స్పాట్‌ల వద్ద అవసరమైన పనులను ప్రారంభించాలన్నారు. జిల్లాలోని రహదారి ప్రమాదాలను ఎప్పటికప్పుడు ఐఆర్‌డీఏ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ వివరించారు. తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉప రవాణా శాఖ కమిషనర్ ఎస్‌కె కరీం, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ సుజాత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్

స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన పీసీసీ ఎన్‌డీటీ చట్టంపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలని చెప్పారు.

మంత్రి అంబటిపై దాడికి నిరసనగా కాపు సంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న కాపు సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో జనసైకోల దాడిని ఖండిస్తూ గోరంట్లలో వంగవీటి రంగా విగ్రహం వద్ద కాపు సామాజిక వర్గం, కాపు సంఘాల నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేశారు. కాపు సంఘం నాయకుడు చిల్లర భవానీకిషోర్ మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును గతంలో టీడీపీ హయాంలో మేడికొండూరులో అడ్డుకొని దాడి చేశారన్నారు. నేడు రాష్ట్ర మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుపై ఖమ్మం జిల్లాలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు దాడి చేయడం సరైనది కాదని హితవు పలికారు. కాపు సామాజిక వర్గం నాయకుడుపై చేస్తున్న దాడిని పూర్తిగా ఖండించారు. రాష్ట్ర మంత్రిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీట్లు తెరవాల్సిందిగా డిమాండ్ చేశారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాపులపై చేస్తున్న దాడిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాపు నాయకులు జల్లేపల్లి వేణుబాబు, రామిశెట్టి కోటేశ్వరరావు, అంకం సత్యం, గోరంట్ల కాపు సామాజిక వర్గ నాయకులు, రంగా విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేసి వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వర్లు(ఇంద్ర) డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారుల్లోని అమరావతి రోడ్డు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని చిల్లీస్ సెంటర్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద నిరసన ఆందోళన చేశారు. మంత్రిపై టీడీపీ, జనసేన నాయకులు దాడిని వైఎస్సార్ సీపీ, కాపు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జల్లేపల్లి వేణుబాబు, బుడంపాడు సొసైటీ చైర్మన్ మీరజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈడీ శామ్యూల్ ఆనంద్

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవయంతో తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని ఇండో– జర్మన్ గ్లోబల్ ఆగ్రో రీసెర్చ్ లెర్నింగ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐ.శామ్యూల్‌ఆనంద్ తెలిపారు. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలకు రీజనల్ శిక్షణ కార్యక్రమం పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈడీ శామ్యూల్ ఆనంద్, రైతు సాధికార సంస్థ సైన్స్ టీం థిమాటిక్ లీడ్ ధర్మేంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి పాల్గొన్నారు. శామ్యూల్ ఆనంద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రైతుశాస్త్రవేత్తల పాత్ర ప్రధానమైనదని తెలిపారు. రైతు శాస్త్రవేత్తల కోసం ఒక కోర్సు తయారు చేసి ప్రకృతి వ్యవసాయ అనుభవం ఉన్న వారికి నాలుగేళ్ల పాటు శిక్షణ ఇచ్చి నిపుణులుగా తీర్చిదిద్దడం హర్షణీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాంకేతికత నైపుణ్యాలు, పంట దిగుబడులు పెరిగేందుకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీపీఎం ప్రేమ్‌రాజ్, డీపీపీ భవాని రాజ్, సుష్మిత పాల్గొన్నారు.

బయో ఫర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రూ.7.91 లక్షల విలువైన మందులు స్వాధీనం



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బయో స్టిమ్‌లెంట్స్, నిందితుడు

గుంటూరు రూరల్: అనుమతులు లేకుండా బయోఫర్టిలైజర్స్ విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఏటుకూరు రోడ్డు బొంతలపాడు డొంకలో అనుమతులు లేకుండా బయో ఉత్పత్తులు తయారు చేసి అమ్ముతూ రైతులను మోసగిస్తున్నారని సమాచారంతో దాడులు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో పలు గోదాములు తనిఖీ చేపట్టారు. కోటపాటి కోటేశ్వరరావు, బయో స్టిమ్ లెంట్స్ కెమికల్ ఫెస్టిసైడ్స్‌తో కలపి వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా రా మెటీరియల్ తెచ్చి బయో స్టిమ్ లెంట్స్ తయారు చేయటం గుర్తించారు. అతను తయారు చేసిన బయో స్టిమ్ లెంట్స్ 321 లీటర్ల విలువ రూ.7.91 లక్షలు చేసే స్టీమ్‌లెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బయో స్టిమ్‌లెంట్స్ తయారు చేస్తున్న వ్యక్తిపై కేసును నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ అధికారిని విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, అగ్రికల్చరల్ ఆఫీసర్ కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జి.మహేశ్వరరెడ్డి, వేదికపై మలికార్జునరెడ్డి, వెంకటరమణ తదితరులు

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వరరెడ్డి, కార్యదర్శి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలు జిల్లాలకు చెందిన ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన యూనియన్ నాయకులు హాజరయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ ఏరియర్స్ విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు పీఆర్సీ ఏరియర్స్ ఇవ్వాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చెప్పారు. 1999 నుంచి 2004 వరకు ఉన్న ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీఎఫ్‌కు మార్చాలని కోరారు. ఏపీ జన్‌కోకు సంబంధించి 2018 నాటికి చంద్రబాబు ఆర్టీపీపీని నిర్వీర్యం చేశారని, ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీపీపీని పునఃప్రారంభించి కరోనా నేపథ్యంలో బొగ్గు సంక్షోభం ఉన్నా, మూడు రెట్ల వ్యయంతో బొగ్గునిల్వలు కొని ఉద్యోగులను ఆదుకోవడంతోపాటు, మెరుగైన విద్యుత్ అందించారని గుర్తు చేశారు. రాష్ట్ర చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పి.వెంకటరమణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.బాలాజీ, గుంటూరు జిల్లా రీజనల్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.అలి, రీజనల్ కార్యదర్శి శివరామిరెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, రాజేంద్రకుమార్, పున్నారావు పాల్గొన్నారు.

రేపటి వరకు ఈ-క్రాప్ సామాజిక తనిఖీ

కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్ ఈ–క్రాప్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వంద శాతం ఈ–క్రాప్, 94.99 శాతం ఈ–కేవైసీ పూర్తి చేసిన వ్యవసాయశాఖ... జాబితాలపై ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజులపాటు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)లు చేపట్టింది. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఫిర్యాదుల ద్వారా పరిష్కరించనున్నారు. సామాజిక తనిఖీ తర్వాత ఈ నెల 30వ తేదీన తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్స్యూరెన్స్, పంట రుణాల సున్నావడ్డీ, మద్దతు ధర ద్వారా పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర కార్యక్రమాలు ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చడానికి ఈ–క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత నెలకొంది. అందుకోసం అర్హత కలిగిన ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకుండా ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 2.36,235.11 ఎకరాల్లో పంటలు సాగైనట్లు ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. అందులో 85 వేల మంది రైతులు 2,24,335.57 ఎకరాల్లో(94.99 శాతం) ఈ–కేవైసీ చేయించుకున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు జరిగే సామాజిక తనిఖీ ద్వారా రైతులందరూ తమ పంట, విస్తీర్ణం, ఇతరత్రా వివరాలు సరిచూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి

బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్

వేటపాలెం: రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ సూచించారు. మండలంలోని దేశాయిపేట–4 రైతు భరోసా కేంద్రంలో వీఏఏ, వీహెచ్ఏ, ఏఈఓలకు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్‌కి సంబంధించిన జాబితాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేసి ఈ–క్రాప్ జాబితాల్లో రైతుల పేర్లు చదివి వినిపించాలన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు చేత ఈ–క్రాప్ నమోదు చేయించే బాధ్యత సిబ్బందిపైనే ఉంటుందన్నారు. ఎన్‌పీసీఐలో ఇనాక్టివ్ కేసెస్‌ని పోస్టాఫీస్‌లో ఖాతా తెరిపించాలని తెలిపారు. ప్రతి క్రాప్‌లో విధిగా పంటకోత ప్రయోగాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలయకుడు ఎఫ్రాయం, చీరాల, వేటపాలెం ఏఓలు సుమతి, ఐ.కాశీవిశ్వనాథ్, సరిత పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

చీరాల టౌన్: సౌత్‌జోన్ పోటీల్లో చీరాల విద్యార్థిని ప్రతిభ చూపి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలు అక్టోబర్ 15 నుంచి 17 వరకు తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగాయి. పోటీల్లో చీరాల చైతన్య భారతీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి ఏడాది చదువుతున్న పాలవలస మహాలక్ష్మి ప్రతిభ చూపి కాంస్య పతకాన్ని సాధించింది. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల యాజమాన్యం కాంస్య పతకం సాధించిన మహాలక్ష్మిని అభినందించి సత్కరించింది. కళాశాల యాజమాన్యం రాంబాబు, సురేష్, ఉమ్రాన్, ప్రిన్సిపాల్ సోమేశ్వరరావులు మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల పరిధిలో హన్మకొండలో నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థిని మహాలక్ష్మి 4×400 రిలే పోటీల్లో ప్రతిభచూపి కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.